క్లుప్తంగా

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్,అధికారులు

మెట్‌పల్లి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత అన్నారు. వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారి డివైడర్లపై శుక్రవారం మొక్కలు నాటారు. మొత్తం 600 మొక్కలను నాటనున్నామని, పట్టణాన్ని పచ్చదనంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు తమ ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ మోహన్, డీఈ నాగేశ్వర్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి



బైక్ ర్యాలీలో నరేందర్‌రెడ్డి

పెగడపల్లి: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత ఊట్కూరి నరేందర్‌రెడ్డి అన్నారు. పెగడపల్లి నుంచి నందగిరి, అయితిపల్లి గ్రామాల మీదుగా గోపాల్‌రావుపేట వరకు పట్టభద్రులు, విద్యా సంస్థల టీచర్లు, యువజన సంఘాలతో కలిసి శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెగడపల్లిలో మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తానన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలో ఉంటానని పట్టభద్రులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

సాహిత్యంలో అలిశెట్టిది ప్రత్యేక ముద్ర



నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జగిత్యాల: సాహిత్యంలో తనదైన ముద్రవేసి కవితలను కొత్త పంతలోకి మళ్లించిన చిరస్మరణీయుడు అలిశెట్టి ప్రభాకర్ అని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. జయంతి, వర్ధంతిని పురస్కరించుకుని ముందస్తుగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో...

అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి వేడుకలు ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం

సాక్షి స్పందన

రాయికల్: పట్టణంలోని 3వ వార్డు ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. 'ఇందిరమ్మ కాలనీలో అన్ని కష్టాలే' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించి కాలనీని శుక్రవారం సందర్శించారు. కాలనీలో ఆరుబయట ఉన్న చెత్త చెదారాన్ని పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేసి, కాలనీలో మురికికాలువ నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కోరుట్లరూరల్: పట్టణంలోని కల్లూర్ రోడ్‌లోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అభివృద్ధి పనులకు జగిత్యాల ఎస్ఈఈ సాలియా నాయక్ భూమిపూజ చేశారు.ఆర్‌అండ్‌బీ నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సబ్‌స్టేషన్‌లో అదనపు 11 కేవీ ఫీడర్, కంట్రోల్ రూం ఆధునీకరణ పనులు చేపడుతామని ఎస్ఈఈ తెలిపారు. కార్యక్రమంలో మెట్‌పల్లి డీఈలు గంగారాం, గోపికృష్ణ, కోరుట్ల ఏడీ ఆంజనేయరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గోదారంగనాథుల కల్యాణం

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శనివారం గోదాదేవి రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కన్యాదాతగా ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యంరావు దంపతులు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి

జగిత్యాలటౌన్/కోరుట్ల/కోరుట్ల రూరల్/రాయికల్/సారంగాపూర్/మల్లాపూర్/కథలాపూర్/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం: వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల్లో బారులుదీరారు. పలు ఆలయాల్లో స్వామివార్లను అలంకరించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆలయాల్లో భక్తులతో సందడి నెలకొంది. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనరసింహా ఆలయం, కోరుట్ల పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వర ఆలయం, వాల్గొండ శ్రీ రామలింగేశ్వర త్రికూటాలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ప్రజాప్రతినిధులు, భక్తులు, స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



బీర్‌పూర్ లక్ష్మీనరసింహ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం



రాయికల్ వేంకటేశ్వర ఆయలంలో పూజలు చేస్తున్న భక్తులు



జగిత్యాలటౌన్ దర్శనానికి బారులుదీరిన భక్తులు



మల్లాపూర్ వేంకటేశ్వరాలయం భక్తుల సందడి



దుంపేటలో శ్రీలక్ష్మీనృసింహస్వామి సేవా ఊరేగింపు



పెగడపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



ఎర్దండి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉత్తర ద్వారా దర్శనం



జగిత్యాల కోదండరామాలయంలో కోలాటం ఆడుతున్న మాతలు

పేద ప్రజలకు మెరుగైన వైద్యమందించడమే లక్ష్యం

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



బస్తీ దవాఖానకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగానే పల్లె, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం లింగంపేటలో రూ.13 లక్షలతో నిర్మిస్తున్న బస్తీ దవాఖానాకు భూమిపూజ చేసి మాట్లాడారు. బస్తీ దవాఖానాలను పేదలు ఉపయోగించుకోవాలని, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కన్నా రాకముందే జాగ్రత్తగా ఉండాలన్నారు. మున్సిపాలిటి అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని, ప్రతి వార్డుకు రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పాటు, యావర్‌రోడ్‌ను సైతం విస్తరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, డీఎంహెచ్‌వో ప్రమోద్, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్ రాజయ్య పాల్గొన్నారు.

పొలాలకు సాగునీరందించాలి



గోదావరిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొప్పుల

ధర్మపురి: గోదావరి జలాలపై ఆధారపడి పంటలు వేసుకున్న రైతులకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం తక్షణం స్పందించి రైతాంగానికి నీరందించి ఆదుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని దమ్మన్నపేట గ్రామంలోని గోదావరిని పరిశీలించి మాట్లాడారు. గోదావరిలో నీరు లేక లిఫ్టులకు నీరందక రైతులు వేసుకున్న నారు మడులు ఎండిపోతున్నాయని, కేసీఆర్ పాలనలో గోదావరి నిండుకుండలా ఉందని దీంతో రైతాంగానికి కావాల్సినంత నీరందించామని తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి రైతులకు తక్షణమే నీరందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సొల్ల భీమయ్య తదితరులున్నారు.

• బీజేపీ బలోపేతానికి కృషి

మల్లాపూర్: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా రెండోసారి అవకాశం కల్పించిన రాష్ట్రశాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అరవింద్, జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, అసెంబ్లీ కన్వీనర్ సుకేందర్‌గౌడ్, మండల ఇన్‌చార్జి వడ్డెపల్లి శ్రీనివాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరిని కలుపుకుని పనిచేస్తానని పేర్కొన్నారు.

• బీజేపీ మండల అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి

పెగడపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన పల్లె మోహన్‌రెడ్డి నియామకమయ్యారు. జిల్లా బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.వీఎల్ ఎన్ రెడ్డి మోహన్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని, తన నియమాకానికి సహకరించిన పార్టీ పెద్దలకు, మండల నాయకులకు మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

• ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది

మల్లాపూర్: ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైందని ఎస్సై రాజు, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎన్నికల్లో పాల్గొని ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నారు. విద్యార్థులు ఓటు వేసేందుకు పోటీపడ్డారు. అనంతరం ఓట్లను లెక్కించి ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. కాగా మాక్ పోలింగ్‌ను ఎస్సై రాజు, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భూమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• పొగాకు ఉత్పత్తులు, మత్తుపదార్థాలు అమ్మితే చర్యలు

సారంగాపూర్: పొగాకు, పొగాకు ఉత్పత్తులతో పాటు, ఇతర మత్తుపదార్థాలను సేవించినా, అమ్మినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో గంగాధర్ హెచ్చరించారు. పొగాకు, వాటి ఉత్పత్తులతో పాటు, గంజాయి, డ్రగ్స్ వంటి పదార్థాలను అరికట్టడానికి మండల కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ చైర్మన్‌గా తహసీల్దార్ జమీర్, కమిటీ సభ్యులుగా ఎంపీడీవో గంగాధర్, మండల వైద్యాధికారి డాక్టర్ రాధ, ఎస్సై దత్తాద్రి, ఎంఈవో కిషోర్, ఏవో ప్రదీప్‌రెడ్డి, ఏఈవో వెంకటేష్, ఏపీఎం రాజయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత ఉన్నారు.

• నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస, పొరండ్ల సబ్‌స్టేషన్ల పరిధిలోని పొలాస, గుల్లపేట, అగ్రికల్చర్ కాలేజ్, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, పోరండ్ల, కన్నాపూర్, బాలపల్లి, కండ్లపల్లి, హన్మాజీపేట్ గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ సుందర్ తెలిపారు.

మల్యాల: మద్దుట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని మద్దుట్ల, గొర్రెగుండం, రామన్నపేట గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఆకునూరి శ్రీనివాస్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి, యామాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ తెలిపారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెగడపల్లి, ఏడుమోటపల్లి తాండా, నామాపూర్, మ్యాకవెంకయ్యపల్లి, నరసింహునిపేట, వెంగళాయిపేట గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోరుట్ల రూరల్: కోరుట్ల సబ్ స్టేషన్, మెట్‌పల్లి మండలం కోనరావుపేట, పెద్దాపూర్, కోరుట్ల మండలం సంగెం,పైడిమడుగు, మేడిపెల్లి మండలం వల్లంపెల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ భూక్య శ్రీనివాస్ తెలిపారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



జగిత్యాల మానస స్కూల్‌లో భోగి వేడుకలు



జోగిన్‌పెల్లి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి



లక్ష్మీదేవిపల్లి పాఠశాలలో ముగ్గుల పోటీలు

జగిత్యాలరూరల్/కోరుట్లరూరల్/రాయికల్/ధర్మపురి/సారంగాపూర్/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/కథలాపూర్/కొండగట్టు/మల్యాల/మల్లాపూర్: జిల్లా వ్యాప్తంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్ల ఘనంగా నిర్వహించారు. తమ పాఠశాలల ఆవరణల్లో విద్యార్థినులు ముగ్గులు వేసి అలరించారు. విద్యార్థులు హరిదాసు, గంగిరెద్దుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు అందమైన రంగవల్లికలు వేసి గొబ్బెమ్మలు పెట్టి భోగి మంటలు వేసి నృత్యాలు చేస్తూ సంతోషంగా సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వర్షకొండ పాఠశాలలో గంగిరెద్దుల విన్యాసాలు



సిరికొండలో భోగి వేడుకల్లో విద్యార్థులు

• ముగ్గులు మన సంస్కృతిలో భాగం

జగిత్యాలటౌన్: ముగ్గులు మన సంస్కృతీ, సాంప్రదాయాల్లో భాగమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి అన్నారు. 8 వ వార్డు బీజేపీ నాయకురాలు మామిడాల కవిత ఆధ్వర్యంలో గోత్రాల కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీరబత్తిని కృష్ణ, దూరిశెట్టి మమత, పుష్పరెడ్డి, సింగం పద్మ, షిండేరు భానుప్రియ, కదార్ల లావణ్య, గోత్రాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పల్లెపాటి రాజేశ్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

• జాతీయస్థాయి క్రీడాకారుడికి అభినందన

రాయికల్: జాతీయస్థాయి కరాటే పోటీల్లో అండర్ –12 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన రాయికల్ పట్టణానికి దండిక వికాస్ యాదవ్‌ను శుక్రవారం జిల్లా యాదవ సంఘ అడ్‌హాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గన్నవేని మల్లేశ్‌యాదవ్ సన్మానించారు. కార్యక్రమంలో రెబ్బస్ మల్లయ్య, జేఏసీ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రవియాదవ్, కొమురయ్య, మల్లేశం, మధు, రాజు, మహేందర్, రాజేశ్ పాల్గొన్నారు.

• రాయికల్‌లో హిందీ దివస్

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విశ్వ హిందీ దివస్ సందర్భంగా విద్యార్థులు హిందీ చార్టులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా హిందీ భాష ప్రముఖ్యత విద్యార్థులకు హిందీ పండిట్ రాజేశం వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజశేఖర్, ప్రశాంత్, రమేశ్, పద్మ, తరంగిని, రజిత, సీఎం .శర్మ, హర్షియ పర్వీన్ పాల్గొన్నారు.

• ఘనంగా వేంకటేశ్వరస్వామి జాతర

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండిలో స్వయంభూ వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను గ్రామశివారులోని గోదావరి వద్దకు తీసుకవెళ్లి చక్రస్నానం చేయించి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకవచ్చి అభిషేకం, హోమం పూజలను నిర్వహించి అన్నప్రసాదం చేశారు. ఉత్సవాల్లో గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ప్రసాద్, డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

• పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని అంబిటస్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మండల విద్యాధికారి భీమయ్యకు వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల గుర్తింపు పేరు అంబిటస్‌కు బదులుగా ఇంటర్నేషనల్ పేరుతో నడుపుతూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు.

• పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

జగిత్యాలరూరల్: పండగకు పంచాయతీ కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని, తక్షణమే బకాయిలు, వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

• దుకాణాల్లో అటవీశాఖ అధికారుల తనిఖీ

రాయికల్: పట్టణంలోని పలు కిరాణ దుకాణాలను శుక్రవారం అటవీశాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. చైనా మాంజా వల్ల పక్షులకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, వాటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు రమణరెడ్డి, సంధ్య, కవిత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

• అడవిలో అర్ధరాత్రి పేకాట

మెట్‌పల్లిరూరల్:అటవీ ప్రాంతంలో అర్ధరాత్రి నిర్వహిస్తున్న ఓ పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో దాడులకు వెళ్లిన పోలీసులు పేకాట ఆడుతున్న 13 మంది పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. 13 మందిపై కేసు నమోదు చేసి,రూ.65,500 నగదు, 9 ద్విచక్ర వాహనాలు,11 సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారు. దాడుల్లో సీఐ నిరంజన్‌రెడ్డి,ఎస్సై కిరణ్‌కుమార్, ఏఎస్సై సత్తయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

కొండగట్టు: జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి కొండగట్టు సమీపంలోని జేఎన్‌టీయూ చెక్ పోస్టు వద్ద శుక్రవారం రాత్రి కారును లారీ ఢీకొన్న ఘటనలో దంపతులిద్దరికి తీవ్రగాయాలు కాగా, రెండేళ్ల పాప పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం వెంకటయ్యపల్లికి చెందిన ఉప్పుగండ్ల గిరి తన భార్య శృతి, రెండేళ్ల చిన్నారి రితన్య జగిత్యాలకు కారులో వెళ్తుండగా జేఎన్‌టీయూ చెక్‌పోస్టు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, 108లో జగిత్యాల ప్రధాన ఆస్పత్రికి తరలించారు. శృతి, చిన్నారి రితన్యల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.

• మేడిపల్లి ప్రీమియర్ లీగ్ ప్రారంభం

మేడిపల్లి: క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఉత్సాహం కలుగుతుందని మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎస్సై శ్యామ్ రాజ్‌తో కలిసి మేడిపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

• అక్రమ కేసులకు భయపడేది లేదు

కథలాపూర్: మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టిన భయపడేదిలేదని, తెలంగాణ ప్రజల తరుపున పోరాటాలు చేస్తామని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి అన్నారు. శుక్రవారం కథలాపూర్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను, వైఫల్యాలను బహిర్గతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలు పక్కాగా అమలు చేసేంత వరకు ఉద్యమాలు చేస్తామన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు మహేందర్‌రెడ్డి, వినోద్‌రావు, శంకర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

• గుంతలు పూడ్చిన ఆటో డ్రైవర్

మల్యాల: రోడ్డుపై గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆటో డ్రైవర్ గుంతలు పూడ్చివేశాడు. మల్యాలకు చెందిన ఆటో డ్రైవర్ తడగొండ శ్రీనివాస్ శుక్రవారం స్థానిక బ్లాక్ చౌరస్తా నుంచి మల్యాల అడ్డరోడ్డు వరకు రోడ్డుపై ఉన్న గుంతలను మట్టిపోసి పూడ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను స్థానికులు,డ్రైవర్లు అభినందించారు.